ప్రజాశక్తి
శనివారం 20 మే 2023
5



అల్లూరి సీతారామరాజు

పిడుగుపడి దుక్కిటెద్దులు మృతి



మృతి చెందిన పశువులు

ప్రజాశక్తి- అరకులోయ : మండలంలోని పద్మాపురం గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం పిడుగుపాటుకు గుర్రై రెండు దుక్కి పశువులు మృతి చెందాయి. ఎప్పటిలాగానే దుక్కి పశువులను మేపడానికి ప్రధాని పుట్టు గ్రామ సమీపంలో తీసుకుని వెళ్లారు. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పిడుగు పడి పద్మాపురం గ్రామానికి చెందిన స్వాభి అప్పలనాయుడు, కిల్లో గురులకు చెందిన రెండు పశువులు మృతి చెందాయి. పశువుల కాపరులు ప్రాణాలు దక్కించుకున్నారు.పద్మాపురం పంచాయతీ సర్పంచ్ పెట్టేది సుస్మిత, ఉప సర్పంచ్ భగత్ రామ్, ఎంపీటీసీ, వైఎస్ఆర్ సీపీ నాయకులు శుక్ర సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గిరిజన రైతులను ఆదుకోవాలని వారు అధికారులను కోరారు.

సమస్యలు పరిష్కరించాలని..

శానిటేషన్ కార్మికుల సమ్మె

విధులు బహిష్కరించి ఆసుపత్రుల వద్ద బైఠాయింపు



ముంచంగిపుట్టులో..



అరకులో నినాదాలు చేస్తున్న ఉమామహేశ్వరరావు, కార్మికులు

ప్రజాశక్తి-పాడేరు: తమ వేతన సమస్యల పరిష్కారం కోసం అల్లూరి జిల్లా పాడేరు డివిజన్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులు శుక్రవారం తమ విధులను బహిష్కరించి సమ్మె చేపట్టారు. చింతపల్లి, పాడేరు, ముంచంగిపుట్టు, అరకు ఆస్పత్రులలోని శానిటేషన్ కార్మికులు సుమారు 56 మంది శుక్రవారం సమ్మెలో భాగంగా తమ విధులను బహిష్కరించి ఆసుపత్రుల ముందు బైఠాయించారు. పాడేరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో పనిచేస్తున్న 22 మంది శానిటేషన్ కార్మికులు సమ్మెకు ఉపక్రమించి ఆసుపత్రి ముందు బైఠాయించారు. దీర్ఘకాలంగా ఉన్న తమ వేతన సమస్యల పరిష్కారం కోసం అధికారులు చర్యలు తీసుకోవాలని నినదించారు. పాడేరు జిల్లా ఆసుపత్రిలో శానిటేషన్ కార్మికులు అందరూ సమ్మె చేపట్టడంతో పారిశుద్ధ్య పనులు స్తంభించాయి. ఈ ఆసుపత్రిలో వంద పడకల నుంచి 200 పడకలకు విస్తరించినప్పటికీ శానిటేషన్ సిబ్బందిని పెంచలేదు. దీంతో, ఈ ఆసుపత్రిలో శానిటేషన్ సిబ్బంది కొరత కూడా ఉంది. తాము తీవ్ర పని భారాన్ని, పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నామని పారిశుధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు ఎల్.సుందర్‌రావు మాట్లాడుతూ, ఆస్పత్రుల శానిటేషన్ కార్మికుల వేతన సమస్యల పరిష్కారంపై వైద్య విధాన పరిషత్ అధికారులు శ్రద్ధ చూప లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అనేకసార్లు కార్మికుల వేతన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్ళామని చెప్పారు. ప్రతి కార్మికుడికి కనీస వేతనం 26 వేలు చెల్లించాల్సి ఉందని, కొన్ని ఆసుపత్రుల్లో కార్మికులకు రూ.10,700. మరికొన్ని ఆసుపత్రుల్లో 9,500 చొప్పున చెల్లిస్తున్నారని తెలిపారు. పిఎఫ్ ఈఎస్ఐ సక్రమంగా చెల్లించలేదని విమర్శించారు.కార్మికులు చేపడుతున్న సమ్మెతోనైనా అధికారులు స్పందించి వేతన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కాంట్రాక్టు విధానం రద్దు చేసి, వైద్య విధాన పరిషత్ ద్వారా జీతాలు చెల్లించాలని, ప్రతి ఆస్పత్రిలో సరిపడా సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు.2019 నుంచి కార్మికుల జీతాలు పెంచలేదని, గత నాలుగేళ్లలో అన్ని నిత్యావసర ధరలు రెట్టింపు అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పారిశుద్ధ్య సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.ముత్యాలమ్మ, సుధారాణి, ఘటి, పుణ్యవతి, రాజేశ్వరి, సింహాచలం, నాగేశ్వరరవు, శివ, పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు:మండల కేంద్రంలో సామాజిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు సిఐటియు అధ్వర్యంలో రిలే నిరాహారదీక్ష చేపట్టారు. లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాధ్ మాట్లాడుతూ, కనీస వేతనం రూ:26000 చెల్లించాలని, అన్ని ఆసుపత్రులలో సరిపడా సిబ్బందిని నియమించాలన్నారు. జీతంతో కూడిన సెలవులు మంజూరు చేయాలన్నారు. పేసియల్ యాఫ్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ధర్మారావు, ఎం.సుబ్రమణ్యం, వి.నారాయణ, కే.సుబ్బలక్ష్మి, గాసన్న, దేవి, వసంత, సీఐటీయూ జిల్లా నాయకులు పి.భీమరాజు, కే కేశవరావు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్:అరకువేలి ఏరియా ఆసుపత్రిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు విధులను బహిష్కరించి సమ్మె చేపట్టారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత కొంతకాలంగా పారిశుధ్య కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని కాంట్రాక్టర్, వైద్యాధికారులకి విన్నవించినా పట్టించుకోలేదని అందుకే సమ్మెకు దిగాల్సి వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుల సంఘం నాయకులు రఘు, ద్రౌపతి, మోహన్, తదితరులు పాల్గొన్నారు.



పాడేరులో నినాదాలు చేస్తున్న కార్మికులు

ఉత్సాహంగా సమ్మర్ క్యాంపు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండల కేంద్రంలో గిరి బాల నేస్తం సమ్మర్ క్యాంపు శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. గిరిజన మహిళా సంఘం (ఐద్వా) ఎస్.ఈశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపులో తల్లిదండ్రులు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం చేపట్టిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం సర్పంచ్ త్రినాథ్, సిఐటియు మండల కార్యదర్శి శంకర్, సిపిఎం, గిరిజన సంఘం మండల కార్యదర్శులు భీమరాజు, నరసయ్య, టిడిపి మహిళ అధ్యక్షురాలు సంధ్య తల్లిదండ్రులు పాల్గొన్నారు.



క్యాంపునకు హాజరైన చిన్నారులు

ఘనంగా సుందరయ్య వర్ధంతి

ప్రజా సమస్యల పరిష్కారానికి సుందరయ్య పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహించాలని సిపిఎం, గిరిజన సంఘం నేతలు పిలుపునిచ్చారు. సుందరయ్య వర్ధంతిని శుక్రవారం అల్లూరి జిల్లాలో ఘనంగా నిర్వహించారు.



అరకులో నివాళి అర్పిస్తున్న సురేంద్ర, ఉమామహేశ్వరరావు, నాయకులు

పాడేరు:సిపిఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య ఈ తరానికి మార్గదర్శి అని కొనియాడారు. రాజకీయ వేత్తలు, రాజకీయాలు ఎలా ఉండాలో నిలువెత్తు నిదర్శనంగా సుందరయ్య నిలుస్తారన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు ఎల్. సుందర్ రావు,దాస్, చిన్నారావు, మాణిక్యం పాల్గొన్నారు.

అరకులోయ రూరల్:అరకువేలి గిరిజన సంఘం కార్యాలయంలో సుందరయ్య చిత్ర పటానికి సిపిఎం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సురేంద్ర మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతగా కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య కీలక పాత్ర పోషించారన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని కమ్యూనిస్టు పోరాట యోధుడుగా దళితులు, రైతులు, వ్యవసాయ కార్మికులు సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించారని చెప్పారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, ఐద్వా సంఘం అల్లూరి జిల్లా గౌరవ అధ్యక్షురాలు వివి జయ, గిరిజన మహిళ సంఘం నాయకురాలు జి.సన్యాసమ్మ, సిపిఎం మండల నాయకులు కె.మగ్గన్న, గిరిజన సంఘం మండల కార్యదర్శి పి.రామన్న, బాలకృష్ణ పాల్గొన్నారు.



ముంచంగిపుట్టులో..

హుకుంపేట:మండలంలోని మెరక చింత పంచాయతీ రంగ్సింగ్‌పాడులో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించరు.ఈ సందర్భంగా సిపిఎం, గిరిజన సంఘం మండల కార్యదర్శులు వి లక్ష్మణరావు, టి క్రిష్టారావులు మాట్లాడారు.ఎం సింహాచలం, వై.చిట్టిబాబు, ఎం.సోమన్న, వి మత్యలింగం, లచ్చన్న, పండన్న పాల్గొన్నారు.

అనంతగిరి:గిరిజన సంఘం కార్యాలయంలో సుందరయ్యకు జెడ్పీటీసీ. గంగరాజు ఘనంగా నివాళి అర్పించారు. టోకురు సర్పంచ్ కిల్లో మోస్య, సిపిఎం మండల కార్యదర్శి సోమెల నాగులు, గిరిజన సంఘం కార్యదర్శి జన్ని సుబ్బారావు, జి.కలవతి, సింహాచలం, చిన్నారావు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో గిరిజన సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి సీపీఎం మండల కార్యదర్శి పి.భీమరాజు కె.శంకరరావు, సర్పంచ్ త్రినాధ్, నర్సయ్య పూలమాలవేసి నివాళులర్పించారు.

రాజవొమ్మంగి : ప్రజా సమస్యల పరిష్కారానికి సుందరయ్య పోరాటస్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు పిలుపునిచ్చారు. మండలంలోని చికిలింత పంచాయతీ మద్దిబందల గ్రామంలో పార్టీ మండల కమిటీ సభ్యులు రామరాజు అధ్యక్షతన కమ్యూనిస్టు గాంధీ, పీడిత ప్రజల విముక్తిదాత పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు, జోహార్లు అర్పించారు. సిపిఎం నేత బలరాం మాట్లాడుతూ, సుందరయ్య ఉద్యమస్ఫూర్తితో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ సభ్యులు జె రాజు,పి పాపారావు, పి సత్యనారాయణ, కె.జగన్నాధం, పి చిన్నారావు, పి రాంబాబు, ఎ సత్తిబాబు పాల్గొన్నారు.

చింతూరు: మండలంలోని ఎర్రంపేట రచ్చబండ సెంటర్ వద్ద పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని ఆయన చిత్రపటానికి మండల కార్యదర్శి సిసం సురేష్, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, కుంజ సీతారామయ్య, పల్లపు వెంకట్.తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముట్టుం రాజయ్య అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో సీసం సురేష్, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం సొంత ఆస్తులను పేద ప్రజల కోసం పంచిన మహోన్నత నాయకుడని కొనియాడారు, సుందరయ్య స్ఫూర్తితో పోలవరం ముంపు గ్రామాల సమస్యలు, స్థానికంగా మౌలిక వసతుల కల్పనపై పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు పోడియన్ లక్ష్మణ్, కారం సుబ్బారావు, కారం నాగేష్, లెనిన్, గుర్రం పెదగయ్య, సాయం భారతి, సోడి రెడ్డి, సోడే రాములమ్మ, సోడే రాఘవయ్య పెద్దర్లు పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలోని. డౌనూరు పంచాయతీ ముళ్ళుమెట్ట శాఖ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి సిపిఎం,ఇతర ప్రజాసంఘాల నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.సిఐటియు నాయకులు వై అప్పలనాయుడు, పి.బొంజన్న, చిట్టన్న, కామేశ్వరరావు, ప్రవీణ్, కృష్ణారావు, సుబ్బలక్ష్మి, కాసులమ్మ పాల్గొన్నారు.

ఎటపాక: బాసవాగు, ఎర్రబోరు గ్రామాలలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభలు జరిగాయి. సుందరయ్య చిత్రపటానికి సిపిఎం ఎటపాక మండల కార్యదర్శి ఐ.వి., సీనియర్ నాయకులు ఇరపా సత్యం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శివర్గ సభ్యులు ఐ.పద్మ, ఇరపా అజయ్, పి.బాలకృష్ణ, పార్టీ మండల కమిటీ సభ్యులు బుద్దుల భద్రయ్య, కారం జయమ్మ, జి.హరనాథ్, పార్టీ నాయకులు సరవయ్య, పనితి వెంకటేశ్వర్లు, సీసం అర్జున్, నూతలపాటి సుధాకర్, తోట శ్రీను, సరియం లక్ష్మి, తోట రమణ, వి.ప్రవీణ్, చుక్కమ్మ, పి.రవి పాల్గొన్నారు.

కూనవరం :అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా మండలంలోని రేపాక గ్రామంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు బాబు బొర్రయ్య అధ్యక్షతన సుందరయ్య చిత్రపటానికి జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, సర్పంచ్ సోడే శంకర్, మడకం బొజ్జి, మడకం జోగయ్య పాల్గొన్నారు.



రాజవొమ్మంగిలో మాట్లాడుతున్న రామారావు

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే

కఠిన చర్యలు



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్నఎంపిడిఒ బాపన్నదొర

ప్రజాశక్తి- రాజవొమ్మంగి : ఉపాధి హామీ పనులలో అవకతవకలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎంపిడిఒ కె బాపన్నదొర హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని మర్రిపాలెం, జడ్డంగి, ఒట్టి గడ్డ, దూసరపాము తదితర గ్రామాలలో ఉపాధి పనులను ఆకస్మిక తనిఖీ చేసి పరిశీలించారు. మస్టర్ షీట్‌లలో దిద్దుబాట్లు, పనికి రాని వారికి మస్టర్లు వేసి ఎన్ఎంఎంఎస్ యాప్‌లో హాజరు వేయడం, పనిలో ఒకరికి బదులు మరొకరు రావడం, కొలతల ప్రకారం పని జరగకపోవడం, ఉపాధి కూలీలు పనికి వచ్చి హాజరు వేసిన వెంటనే వెళ్లిపోవడం, టెక్నికల్ అసిస్టెంట్లు, సంబంధిత సిబ్బంది ఫీల్డ్‌కు వెళ్లక పోవడం తదితర లోపాలు గుర్తించినట్లు ఎంపిడిఒ తెలిపారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడితే మేటు, ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

చంద్రబాబు వ్యాఖ్యలపై నిరసన



చంద్రబాబు ఫొటోలను దగ్ధం చేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి , వైసిపి నేతలు

ప్రజాశక్తి- కొయ్యూరు : పేదలకు సొంతింటి కలలు నిజం చేయాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషిచేస్తుంటే, విపక్షనేత చంద్రబాబు దుర్మార్గమైన వ్యాఖ్యలు చేయడం సరికాదని ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. పేదలకు ఇస్తున్న సెంటు భూమిలో శవం పూడ్చుకోవడానికి చాలదంటూ ఎస్.కోటలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా ఆయన చిత్రపటాలను దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చంద్రబాబు హయంలో పేదల ఇంటి నిర్మాణానికి సెంటు భూమైనా ఇచ్చారా?అని ప్రశ్నించారు. లోకేష్ యువగళంలో గానీ, ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో చంద్రబాబుగానీ, తాము అధికారంలోకి వస్తే ప్రజలకు ఏం చేయబోతున్నారో చెప్పలేక జగన్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారు. జిఒ3పై వైసిపి నిర్లక్ష్యంగా ఉందంటూవిపక్షాల అసత్య ప్రచారాలను కూడా ఎమ్మెల్యే ఖండించారు. దీనిపై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేసిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు.

గిరిజనుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



సంక్షేమ పథకాల బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి -కొయ్యూరు : గిరిజనుల ఆర్థిక అభివృద్ధే వైసిపి ప్రభుత్వం లక్ష్యమని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. అర్హత ఒక్కటే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. శుక్రవారం మండలంలోని రాజేంద్రపాలెం గ్రామ సచివాలయం పరిధిలోని సోలాబు, జోగంపేట, రాజేంద్రపాలెం, కొత్త వీధి, సురేంద్ర పాలెం గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరు గురించి ప్రజలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. సచివాలయం వ్యవస్థ పనితీరుపైనా, గ్రామాల్లో ఉన్నటువంటి సమస్యలపైనా ప్రత్యేకంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పేదలు, అణగారిన వర్గాల పక్షాన పనిచేస్తుందని తెలిపారు. సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రతి ఇంటి వద్దకే సంక్షేమ పాలనను అందించడం ద్వారా జగన్మోహన్ రెడ్డి ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు జల్లి బాబులు, ఎంపీపీ బడుగు రమేష్, జెడ్‌పిటిసి వారా నూకరాజు, వైస్ ఎంపిపి అంబటి నూకాలమ్మ, ఎఎంసి చైర్మన్ జైతి రాజులమ్మ, ఎంపిటిసి మల్లేశ్వరి, రాజులమ్మ, బడిజన అప్పారావు, కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ సూరిబాబు, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు ముసలి నాయుడు, ఎం మాకవరం సర్పంచ్ కూడా రాజబాబు, అంతాడ సర్పంచ్ చందు, ప్రచార కమిటీ అధ్యక్షుడు ధోని, బాబ్జి, మంప సర్పంచ్ త్రిమూర్తులు, చీడిపాలెం సర్పంచు నెత్తురు సోమన్న దొర, సీనియర్ నాయకులు ధూపం శ్రీను, రావెల గంగాధర్, డైరెక్టర్ అచ్యుత్, నరసింహులు, శేఖర్, జల్లి ప్రసాద్, రాజేంద్రపాలెం సచివాలయ కన్వీనర్ గోకిరి చిన్నారావు పాల్గొన్నారు.

పలు కేసుల్లో చోరీ సొత్తు స్వాధీనం

- ఇద్దరు నిందితుల అరెస్ట్
-189 గ్రాముల బంగారం,
మూడు బైకులు, సెల్‌ఫోన్ రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న ఓఎస్‌డి మహేశ్వరరెడ్డి, ఎఎస్‌పి రాహుల్‌మీనా

ప్రజాశక్తి -ఎటపాక : 2016 నుండి 2023 వరకు జరిగిన వివిధ బంగారు నగల దొంగతనాల కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 189 గ్రాములు బరువైన 9 గొలుసులు, మంగళ సూత్రాలు, మూడు బైక్ లు, ఒక సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా పోలీసులు తెలిపారు. శుక్రవారం ఎటపాక పోలీస్ స్టేషన్‌లో రంపచోడవరం ఓఎస్‌డి కెవి మహేశ్వరరెడ్డి, చింతూరు ఎఎస్‌పి రాహుల్ మీనా మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. అల్లూరి జిల్లా ఎస్‌పిగా తుహిన్ సిన్హా భాధ్యతలు చేపట్టిన పెండంగ్‌లో ఉన్న చోరీ కేసులపై దృష్టి పెట్టారన్నారు. రంపచోడవరం ఓఎస్‌డి కెవి మహేశ్వరరెడ్డి పర్యవేక్షణలో చింతూరు ఏఎస్పి రాహుల్ మీనా ఆధ్వర్యంలో, ఎటపాక సిఐ ఎం.గజేంద్ర కుమార్ నేతృత్వంలో ఎటపాక ఎస్ఐ కె. పార్థసారథి, వి ఆర్ పురం ఎస్ఐ ఎం దుర్గా ప్రసాద్, కూనవరం ఎస్ఐ బి వెంకటేష్‌ల ఆధ్వర్యంలో మూడు బృందాలు గాలింపు చర్యలు చేపట్టి, నిందితులను పట్టుకున్నారన్నారు. నెల్లిపాక సమీపంలో బంగారు నగలు అమ్ముకొని నగదుతో వెళ్తున్న తెలంగాణ రాష్ట్ర భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉసిర్ల గూడెం గ్రామానికి చెందిన నాగేంద్రబాబు, పశ్చిమ గోదావరి జిల్లా, ములగం పల్లి గ్రామానికి చెందిన వల్లూరి నాగరాజులను పట్టుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. చోరీ కేసులను చేధించి నేరస్తులను చాకచక్యంగా పట్టుకున్న పోలీసు సిబ్బందిని పోలీసు అధికారులు రంపచోడవరం ఓఎస్డి కెవి మహేశ్వరరెడ్డి, చింతూరు ఏఎస్పి రాహుల్ మీనా అభినందించారు.





పోలీసులు రికవరీ చేసిన నగలు, బైక్‌లు

జీవ వైవిధ్య పరిరక్షణపై అవగాహన



ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: రాజవొమ్మంగి అటవీరేంజ్ పరిధిలోని పలు గ్రామాలలో స్థానిక రేంజర్ ఎం అబ్బాయి దొర ఆధ్వర్యంలో శుక్రవారం జీవ వైవిధ్య పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని జూన్ 5 వరకు లైఫ్ స్టైల్‌పైఅవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. విద్యుత్ పొదుపు, నీటి వృథాను అరికట్టడం, ఇంకుడు గుంతలు తవ్వడం ద్వారా భూగర్భ జలాలు పెంపొందించడం, ప్లాస్టిక్ నిషేధం, ప్రత్యామ్నాయంగా గుడ్డ, నార సంచుల వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించి, తద్వారా పర్యావరణం, జీవవైవిధ్యం పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. దీంతోపాటు మొక్కలు నాటడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై వివరించారు. ఈమేరకు ర్యాలీ నిర్వహించారు. రాజవొమ్మంగి, వైయ్యాడు, బడదనాంపల్లి, జడ్డంగి అన్నవరం, పాపంపేట తదితర గ్రామాల్లో లైఫ్ స్టైల్‌పై నిర్వహించిన అవగాహన ర్యాలీలు, సదస్సులో అటవీశాఖ అధికారులు, సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ ముసలినాయుడు

ప్రజాశక్తి -కొయ్యూరు: మండలంలోని కొండగొకిరి పంచాయతీ, గుజ్జుమాను పాకలు గ్రామంలో బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నిర్మాణానికి సర్పంచ్ రేగటి ముసిలి నాయుడు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి వార నూకరాజు వైస్ ఎంపిపి అప్పన్న వెంకటరమణ, డౌనూరు ఎంపిటిసి అప్పారావు కొండగొకిరి జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు ధోని బాబ్జి, వై. రామరాజు, బిఎస్ఎన్ఎల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

22న రామరాజ్యం వర్ధంతి

ప్రజాశక్తి -కొయ్యూరు: మండలానికి చెందిన సిపిఐ సీనియర్ నేత, మాజీ ఎంపిపి బడుగు రామరాజ్యం 7వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆమె స్వగ్రామం కించమనిపాలెంలో ఈనెల 22న నిర్వహించనున్నట్లు సిపిఐ మండల పార్టీ అధ్యక్షుడు ఇరువాడ దేముడు తెలిపారు. సిపిఐ మండల నాయకులు అభిమానులు పాల్గొని జయప్రదంచేయాలని కోరారు.

గిరిజన సంఘం

జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షులు ధర్మన్న పడాల్



ప్రధాన కార్యదర్శి బాలదేవ్

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా గిరిజన సంఘం జిల్లా కమిటీ విభాగాల నూతన కార్యవర్గం ఎన్నికలు జిల్లా 8వ మహాసభల్లో భాగంగా శుక్రవారం పాడేరులో నిర్వహించారు. ఈ ఎన్నికలకు పరిశీలకులుగా జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పల నర్స, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర వ్యవహరించారు. గిరిజన సంఘం ఎనిమిదవ మహాసభలో ఏకగ్రవంగా జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడుగా బోనంగి చిన్నయ్య పడాల్, జిల్లా అధ్యక్షుడుగా సాగిన ధర్మన్న పడాల్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పొద్దు బాల్ దేవ్, కోశాధికారిగా కొర్ర నరసయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సివెరి కొండల రావు, జిల్లా ఉపాధ్యక్షులుగా టి.సూర్య నారాయణ, టి. కృష్ణారావు, సాగిన చిరంజీవి పడల్, కె.సర్బా నాయుడు, కె.వీరయ్య, ఎం.చంటి బాబు, ఎంఎం శ్రీను, సహాయ కార్యదర్శిలుగా పి.రామన్న, కే.శర్బాన్న, కె.సత్యనారాయణ, వి.కోటిబాబు, పి.కుమారి, పి.శ్రీను, పి.చిట్టి బాబు జె.పెంటయ్య, కాఫీ రైతు విభాగం జిల్లా ఉపాధ్యక్షుడుగా పి.లక్కు, జి.చిన్న బాబు, జీడి మామిడి రైతు విభాగం జిల్లా సహాయ కార్యదర్శులుగా జె రమణ, శ్రీను, కీముడు రాంబాబు, గిరిజన ఉద్యోగ విభాగం జిల్లా ఉపాధ్యక్షులుగా పి.దొన్ను, కె గోపి, గిరిజన మహిళ విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలుగా పి. కుమారి ఈశ్వరి,శ్రీ లత, గిరిజన విద్యార్థి విభాగం కె. ప్రభు దాస్ (జిల్లా సహాయ కార్యదర్శి), జిల్లా కార్యవర్గ సభ్యులుగా కె త్రినాథ్, పి.దొంబు, సొమ్మన్న, ఎస్ చిట్టి బాబు,సునీల్, సన్యాసి దొర,జి.బుజ్జి బాబు,బి.రామకృష్ణ, పి.గంగరాజు, కే.బాలయ్య, చంద్రయ్య, సత్యనారాయణ, ఎస్. నాగేంద్ర, నియమితులయ్యారు.

21 నుంచి శ్రీరామగిరిలో రాజుల జాతర

ప్రజాశక్తి- విఆర్.పురం: మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో కొలువుదీరిన రాజుల స్వామి ఆలయంలో రాజుల జాతర ఈ నెల 21 నుంచి నిర్వహించనున్నటు ఆలయ కమిటీ మెంబర్ ఆత్మకూరు కాంతారావు తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయన్నారు ఆదివారం నుండి తొమ్మిది రోజులు పాటు నిర్వహించే ఈ జాతరకు అధిక సంఖ్యలో గిరిజనులు, భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున దానికి తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

అనారోగ్యంతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

ప్రజాశక్తి-పెదబయలురూరల్: మండలంలోని అడుగులపుట్టు పంచాయతీకి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ రాసగుల్లెల తిరుపతి నాయుడు అనారోగ్యంతో మృతి చెందాడు. గత కొద్ది కాలం నుండి అనారోగ్య కారణంగా విశాఖ కేజీహెచ్ ఆసుపత్రిలో చికిత్స పొందిన, పిదప తన స్వగ్రామమైన ఆల్లంపుట్టు లో ఇంటి వద్ద వైద్యుల సలహా సూచనలు మేరకు మందులు వాడుతున్నాడు. శుక్రవారం మృతి చెందడంతో కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

మృతదేహాలు లభ్యం

ప్రజాశక్తి-పెందుర్తి : 88వ వార్డు పరిధి నరవ శివారు నల్ల క్వారీలులో గురువారం గల్లంతైన పాలిటెక్నిక్ విద్యార్థులు రాకేష్, నిఖిల్ మృతదేహాలు లభ్యమయ్యాయి. గజ ఈతగాలతో పోలీసులు గాలింపు చేపట్టగా గురువారం రాత్రి ఒకరిది, శుక్రవారం మరొకరిది మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు పోలీసులు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ క్వారీ చుట్టూ కంచె ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

డీ సెట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రాథమిక విద్యలో ఉపాధ్యాయ వృత్తికి అవసరమయ్యే డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సులో ప్రవేశం కోసం ఎపి పాఠశాల విద్యా శాఖ డీసెట్ -2023 నోటిఫికేషన్‌ను జారీ చేసిందని స్థానిక ప్రభుత్వ డైట్ ప్రిన్సిపల్ యు.మాణిక్యంనాయుడు శుక్రవారం తెలిపారు. ఈ నెల 11 నుంచి 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. జూన్ 12, 13 తేదీల్లో ప్రవేశ పరీక్ష జరగనుందని తెలిపారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఫీజు తదితర వివరాలు, ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం cse.ap.gov.in వెబ్ సైట్‌ను సందర్శించాలని సూచించారు.

స్పందన ఫిర్యాదులను పరిష్కరించండి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



వినతలు స్వీకరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరుటౌన్: స్పందనలో స్వీకరించిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జెసి జె.శివ శ్రీనివాసు, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాత్సవతో కలిసి జిల్లా నలుమూల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన స్పందనకు 65 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన ఫిర్యాదుల పై రాష్ట్ర ప్రభుత్వం జగనన్నకు చెబుదాంకు ప్రత్యేక దృషి, పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం పెడుతోందని చెప్పారు. ఆ దిశగా అధికారులు ఫిర్యాదులు పరిష్కారానికి చొరవ చూపించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మోద కొండమ్మ జాతరను విజయవంతం చేసారని జిల్లా కలెక్టర్ అధికారులను అభినందించారు.

స్పందనలో స్వీకరించిన ఫిర్యాదులు

చింతపల్లి మండలం లోతుగెడ్డ సచివాలయం పరిధిలోని బందబయలు గ్రామానికి చెందిన పాత చెరువు డైవర్షన్ వాల్ హుద్‌హుద్ తుఫానులో కొట్టుకుని పోయిందని దానిని పున:నిర్మించి సాగునీరందించాలని గ్రామస్తులు టి.భవాని, టి.మురళికృష్ణ, టి.సన్యాసిదొర తదితరులు వినతి పత్రంలో కోరారు.జి.మాడుగుల మండలం వంతల గ్రామ పంచాయతీ సిరిపురం గ్రామానికి చెందిన గెమ్మిలి సుబ్బారావు, పాడేరు మండలం గొండెల పంచాయతీ గ్రామస్తురాలు కొర్ర పద్మ తదితర 15 మంది రైతులు అటవీ హక్కు పత్రాలు మంజూరు చేయాలని దరఖాస్తులను సమర్పించారు. కొయ్యూరు మండలం ఎం.భీమవరం గ్రామ పంచాయతీ బుగ్గిరాయి గ్రామం అంగన్వాడీ కేంద్రంలో ఖాళీ గా అంగన్వాడీ టీచర్ పోస్టుకు కె. శివ కుమారి దరఖాస్తు చేసారు. జి. మాడుగుల మండలం మద్ది వీధి గ్రామానికి వెళ్లే రహదారిలో సిసి ర్యాంపు నిర్మించాలని గ్రామస్తులు జి.రఘునాథరావు, కె.సురేష్ తదితరులు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్య క్రమంలో డి ఆర్ ఓ పి.అంబేద్కర్, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ. కొండల రావు, గిరిజన సంక్షేమ శాఖ ఇ ఇలు డివి ఆర్ ఎం రాజు, కె.వేణుగోపాల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ భాషా, జిల్లా ఉద్యాన వన అధికారి రమేష్ కుమార్‌రావు, జిల్లా వ్యసాయాధికారి నంద్, డి ఆర్ డి ఏ పిడి వి.మురళి, పి. హెచ్. ఓ. ఎన్. అశోక్, ఐటిడి ఏ పరిపాలనాధికారి హేమలత పాల్గొన్నారు.



పురస్కారాన్ని అందిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

వాలంటీర్లకు పురస్కారాల అందజేత

ప్రజాశక్తి-పాడేరు:. స్థానిక కాఫీ హౌస్ లో శుక్రవారం నిర్వహించిన వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్మమించారు. ఈ సందర్భంగా జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ, జిల్లాలో 352 సచివాలయాల ఫరిధిలో 5547 మంది వాలంటీర్లు విధులు నిర్వహిస్తున్నారని, వారందరూ ప్రజలకు వివిధ రూపాలలో సేవలు అందిస్తున్నారని కొనియాడారు. వాలంటీర్ వ్యవస్థ ద్వారా ఉత్తమ సేవలు అందించిన 3323 మందిని గుర్తించి సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలు అందజేసి ప్రభుత్వం ప్రోత్సహించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో 1887 మందికి సేవా మిత్ర, 53 మందికి సేవా రత్న, 15 మందికి సేవా వజ్ర పురస్కారాలు అతిదుల చేతుల మీదుగా అందజేసారు. ఈ పురస్కారాల కింద ఎంపికైన ప్రతి ఒక్కరికీ మెడల్, షాల్, ధవపత్రంతో పాటు బ్యాడ్జ్ అందజేశారు. అదేవిధంగా సేవా వజ్రకు ఎంపికైన వారికి రూ. 30 వేలు, సేవా రత్నకు ఎంపికైన వారికి రూ. 20 వేలు, సేవా మిత్రకు ఎంపికైన వారికి రూ. 10 వేలు నగదు పారితోషికాన్ని అందజేశారు.

పాడేరు నియోజకవర్గం ఫరిధిలో ఐదు మండలాల నుండి 589 మంది సేవా మిత్రలుగా, 25 మంది సేవా రత్నలుగా, ఐదుగురు సేవా వజ్రలుగా ఎంపికయ్యారు. అరకు నియోజకవర్గం ఫరిధిలో ఆరు మండలాల నుండి 624 మంది సేవా మిత్రలుగా, 30 మంది సేవా రత్నలుగా, ఐదుగురు సేవా వజ్రలుగా ఎంపికయ్యారు. రంపచోడవరం నియోజకవర్గం 11 మండలాల నుండి 3100 మంది సేవా మిత్రలుగా, 108 మంది సేవా రత్నలుగా, ఐదుగురు సేవా వజ్ర లుగా ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు, పాడేరు ఎంపిపి రత్నకుమారి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్పర్సన్ సరస్వతి, పలువురు జెడ్ పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, డిపిఓ కొండలరావు, డిఆర్డిఎ పిడి వి. మురళి, డివిజినల్ పిఓ వి.ఎస్. కుమార్, గ్రామ వార్డు సచివాలయ అధికారి సునీల్, తహసిల్దార్ త్రినాధరావు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ప్రజాశక్తి- అడ్డతీగల : గంగవరం మండలం జడేరు గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగవరం మండలం మర్రిపాలెం గ్రామానికి చెందిన పల్లాల గోపాల్ రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. సంఘటనాస్థలిలో ఉన్న వ్యక్తులు నుంచి సమాచారం అందుకున్న 108 వాహనసిబ్బంది చేరుకుని, తలకు గాయమైన గోపాలరెడ్డికి ప్రథమ చికిత్స చేసి, అనంతరం రంపచోడవరం ఏరియా హాస్పిటల్‌కు తరలించినట్లు ఇఎంటి రామకృష్ణ, పైలెట్ నవాజ్ తెలిపారు. దీనిపై పోలీసులకు సమాచారం తెలిపినట్లుగా గ్రామస్తులు తెలిపారు



గాయపడిన గోపాలరెడ్డికి ప్రథమ చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

ఆదివాసీ సంస్కృతి సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స

ప్రజాశక్తి -పాడేరు: గిరిజన సంఘం ఎనిమిదవ రాష్ట్ర మహాసభల సందర్భంగా జూన్ 6 నుంచి 8 వరకు అరకులోయలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఆదివాసీ సంస్కతి సమ్మేళనంను జయప్రదం చేయాలని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పల నర్స పిలుపు నిచ్చారు. గిరిజన సంఘం జిల్లా 8వ మహాసభ ముగింపు సమావేశం శుక్రవారం పాడేరు పి.ఎం.అర్.సి భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన సంస్కతి సంప్రదాయం ముసుగులో దాడి పెరుగుతుందని, విష సంస్కతి గిరిజన ప్రాంతాల్లో విస్తరిస్తున్న నేపథ్యం లో గిరిజన సంస్కతి సంప్రదాయం పరి రక్షణ, విస్తరణ, ప్రచారం కీలకంగా మారిందని అన్నారు. భవిష్యత్ తరంకు ఆదివాసీ వారసత్వ సంపద, సంస్కతి సంప్రదాయం అదించవలసిన బాధ్యత నేటి తరంపై ఉందని అన్నారు.గిరిజన సంఘం రాష్ట్ర మహాసభ జూన్ 8, 9 తేదీల్లో అరకు లోయ లో నిర్వహిస్తున్న సందర్భంగా ఆదివాసీ సంస్కతి సమ్మేళనంను జూన్ 6నుంచి 8 వరకు, మూడు రోజులు నిర్వహిస్తామని తెలిపారు. 34 ఆదివాసీ తెగల అస్తిత్వం చాటి చెప్పే విధంగా కొమ్ము డాన్స్, దింసా, కోలాటం, అందేల రవళి ఆదివాసీ డి.జె డాన్స్, నంది కోట్క,ఆదివాసీ అట, పాట, మాట తదితర కళారూపాలు ప్రదర్శించ పడతాయని తెలిపారు. ఆసక్తి ఉన్న గిరిజన కళాకారులు తమ పేర్లను జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాల్ దేవ్ ఫోన్ నెంబర్ 9491788043 కి ఫోన్ చేసి నమోదు చేసు కోవాలని సూచించారు ప్రతి కళాకారులకు సర్టిఫికేట్ ఇస్తామని, ప్రతి టీముకు మెమెంటోలు అందజేస్తామని తెలిపారు. ఈ మహాసభలో వివిధ మండలాల నుంచి గిరిజన సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ప్రమోషన్స్ కల్పించాలి

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా పాడేరు డివిజన్లోని గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వి మహేశ్వరరావు కోరారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఎ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో గత కొంతకాలంగా ప్రమోషన్స్ ఇవ్వక పోవడం తో ఆశ్రమ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో గిరిజన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ మేరకు వేసవి సెలవుల్లోనే ప్రమోషన్స్ కల్పించాలని శుక్రవారం స్పందనలో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారికి వినతి పత్రం అందజేశారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు, సహాయ అధ్యక్షులు సి.హెచ్. నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శులు కె.రఘునాథ్, పి.దేముడు, కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.కన్నయ్య, ఎస్.కర్రిబాబులు ఐటీడీఏ పీవోను కలిశారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఉపాధ్యాయులకు సౌలభ్యం చేకూర్చే విధంగా జిల్లా విద్యాశాఖ అధికారి క్యాంపు కార్యాలయం రంపచోడవరంలో ప్రతివారం నిర్వహించాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు కోరారు

పాడేరు నుంచి భద్రాచలం వరకు ఆర్టీసీ బస్సు సర్వీసును ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. రంపచోడవరం ప్రాంతం నుంచి పాడేరు జిల్లా కేంద్రానికి ఉద్యోగులు ఉపాధ్యాయులు వెళ్ళడానికి నేరుగా బస్సు సౌకర్యం లేదని అధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరారు.

రైల్ల సమయాల్లో మార్పులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రైల్వేల పరిధిలోని వివిధ విభాగాల్లో భద్రతా పనుల కారణంగా పలు రైళ్ల సేవల్లో మార్పులు చోటుచేసుకున్నాయని వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సికింద్రాబాద్ డివిజన్‌లోని ఘట్‌కేసర్-చర్లపల్లి సెక్షన్ల మధ్య సేఫ్టీ వర్క్ కారణంగా 12703 హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ మే 20న 3 గంటలు ఆలస్యంగా ఉదయం 08.35 గంటలకు బదులు 11.35 గంటలకు హౌరా నుంచి బయలుదేరుతుంది. 11020 భువనేశ్వర్-ముంబై కోణార్క్ ఎక్స్‌ప్రెస్ భువనేశ్వర్ నుంచి మూడు గంటలు ఆలస్యంగా 15.20 గంటలకు బదులు సాయంత్రం 18.20కి భువనేశ్వర్ నుంచి బయలుదేరుతుంది. 18519 విశాఖపట్నం-ముంబై ఎల్‌టిటి ఎక్స్‌ప్రెస్ మే 20న గంట ఆలస్యంగా రాత్రి 23:20 గంటలకు బదులు అర్ధరాత్రి (మే 21) 00:20 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరుతుంది.

చక్రదర్‌పూర్ డివిజన్‌లో ట్రాఫీ కమ్ పవర్ బ్లాక్ కారణంగా 18107 రూర్కెలా - జగదల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ మే 24న రద్దు చేయబడింది. 18108 జగదల్‌పూర్ - రూర్కెలా ఎక్స్‌ప్రెస్ కూడా రద్దయింది. 12836 ఎస్‌విఎం బెంగళూరు-హతియా ఎక్స్‌ప్రెస్ మే 23న 3:45 గంటలు ఆలస్యంగా నడుస్తుంది.

సంబల్‌పూర్ డివిజన్‌లో నాన్-ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా ఈ నెల 27న విశాఖపట్నం నుంచి బయలుదేరే రైలు నెంబర్ 20807 విశాఖపట్నం-అమృత్‌సర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ అదే రోజున సాధారణ మార్గం విజయనగరం-ఖుర్దా రోడ్-భువనేశ్వర్-సంబల్‌పూర్‌కు బదులుగా విజయనగరం-తిట్లాగఢ్-సంబల్‌పూర్ మీదుగా మళ్లించబడుతుంది.

సికింద్రాబాద్ డివిజన్‌లోని చింతపల్లి-నెక్కొండ స్టేషన్లలో మూడో లైను ఆధునికీకరణ నేపథ్యంలో 18519 విశాఖపట్నం- లోకమాన్య తిలక్ టెర్మినల్ ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నం నుంచి మే 21 నుంచి జూన్ 7 వరకు విజయవాడ-కృష్ణా కెనాల్ జంక్షన్-గుంటూరు-పగిడిపల్లి మీదుగా దారి మళ్లించిన మార్గంలో నడుస్తుంది. 22849 షాలిమార్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ మే 24 నుంచి 31 వరకు ఏలూరు-విజయవాడ-గుంటూరు-పగిడిపల్లి మీదుగా దారి మళ్లించిన మార్గంలో వెళ్తుంది. 18112 యశ్వంత్‌పూర్-టాటా నగర్ ఎక్స్‌ప్రెస్ మే 21, 28, జూన్ 4 తేదీల్లో సికింద్రాబాద్-పగిడిపల్లి-గుంటూరు మీదుగా దారి మళ్లించిన మార్గంలో నడుస్తుంది. 18046 హైదరాబాద్-షాలిమార్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ మే 28, జూన్ 7 తేదీల్లో గుంటూరు - పగిడిపల్లి - సికింద్రాబాద్ మీదుగా దారి మళ్లించిన మార్గంలో వెళ్తుంది. ఈ నేపథ్యంలో ప్రజలు మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని రైల్వే శాఖ అధికారులు అభ్యర్థించారు.

ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగింపు

ప్రయాణికుల అవసరాల దృష్ట్యా ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రత్యేక రైళ్ల సేవలను పొడిగించాలని నిర్ణయించింది. 08543 విశాఖపట్నం-బెంగళూరు కాంట్ వీక్లీ స్పెషల్ రైలు మే 25 వరకు ప్రతి ఆదివారం మధ్యాహ్నం 15:55 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి మరుసటి రోజు 12:30 గంటలకు బెంగళూరు కాంట్ చేరుకుంటుంది. 08544 బెంగుళూరు కాంట్ విశాఖపట్నం వీక్లీ స్పెషల్ 26 వరకు ప్రతి సోమవారం మధ్యాహ్నం 15.50 గంటలకు బెంగళూరు కాంట్ నుంచి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 13.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ జంట రైళ్ళు దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట, కుప్పం, బంగారుపేట, బెంగళూరు కెనకపట్నం, కృష్ణరాజపురం మీదుగా ప్రయాణిస్తాయని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి ఒక ప్రకటన లో తెలిపారు.


డిసిఐ అదనపు డైరెక్టర్, ఛైర్మన్‌గా అంగముత్తు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : డిసిఐ అదనపు డైరెక్టర్, ఛైర్మన్‌గా విశాఖపట్నం పోర్టు అథారిటీ ఛైర్మన్ డాక్టర్ మదేయాన్ అంగముత్తు శుక్రవారం నియమితులయ్యారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులను డిసిఐ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ శుక్రవారం అందజేశారు.

జిఒ 31ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం లారీలు, కార్లు, జీపులు, బస్సులు, వ్యాన్‌లపై త్రైమాసిక పన్నులు పెంచుతూ విడుదల చేసిన జిఒ 31ని రద్దు చేయాలంటూ శుక్రవారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆటో డ్రైవర్లు నిరసన తెలిపారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఎపి ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడారు. ధర్నాలో సిపిఐ నాయకులు రావికృష్ణ, ఆటో సంఘం నాయకులు బి.నూకరాజు, శ్రీను, అప్పలరాజు, బి.రాజు, ఎంపోత్రాజు, యు.ఎల్లాజీ, ఎవి.రావు, డివి.గణేష్ పాల్గొన్నారు.

కూల్.. కూల్..



వర్షంలోనే సాగుతున్న రాకపోకలు

విశాఖలో సాయంకాలం చిరుజల్లులు
చల్లబడ్డ నగరం.. సేదతీరిన జనం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

శుక్రవారం సాయంకాలాన.. చల్లని గాలులు, చిటపటా చినుకులు విశాఖను పలకరించాయి. కొద్ది రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్న జనానికి తాజా వాతావరణం కాసింత హాయిగా అనిపించింది. అంతా ఇళ్ల నుంచి బయటకు వచ్చి సేదతీరారు. ఎన్ఎడి, సాగరతీర ప్రాంతాలు, కంచరపాలెం, సీతమ్మధార, మర్రిపాలెం తదితర చోట్ల వర్షం పడటంతో జనం ఉత్సాహంతో ఉరకలు వేశారు. గాజువాక, పెదగంట్యాడ, దువ్వాడ ప్రాంతాల్లో చల్లని గాలులు వీచాయి. గడచిన కొద్ది రోజులుగా ఎండలతో వాతావరణం మండిపోయిన సంగతి తెలిసిందే. సుమారు 42 డిగ్రీల ఉష్ణోగ్రతల వరకూ విశాఖ నగరంలో నమోదయ్యాయి. జిల్లా అంతటా ఎండ వేడిమికి తట్టుకోలేక వడదెబ్బకు అనేక మంది విలవిల్లాడిపోయారు. దాదాపు 15 రోజులుగా ఈ పరిస్థితులను విశాఖ వాసులు ఎదుర్కొంటూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో కురిసిన వర్షం ఎంతో ఆనందాన్నిచ్చింది. జనం కేరింతలు కొట్టడం ఎక్కడికక్కడే కనిపించింది.

నైరుతి అనుకూల పరిస్థితులు

ఈ నెల 19కి ఆగ్నేయ బంగాళాఖాతంలో కొన్ని ప్రాంతాలైన నికోబార్ దీవులు, దక్షిణ అండమాన్ సముద్రంలో వర్షాలకు అనుకూల వాతావరణం ఏర్పడడమే శుక్రవారం సాయంత్రం నాటి చల్లని వాతావరణానికి కారణమని తెలుస్తోంది. నైరుతి రుతుపవనాలు రాబోయే 3-4 రోజుల్లో దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, నికోబార్ దీవులు, ఇంకొన్ని ప్రదేశాల్లో ముందుకెళ్లే పరిస్థితులు నెలకొన్నట్లు అమరావతి వాతావరణ కేంద్రం తాజాగా వెల్లడించింది. ఈ నెల 20 నాటికి నైరుతి రుతుపవనాలు బంగాళాఖాతంలోని దక్షిణ అండమాన్ సహా మరికొన్ని ప్రాంతాలకు, నికోబార్ దీవులకు విస్తరించే అవకాశాలున్నట్లు విశాఖపట్నం వాతావరణ కేంద్రం నివేదిక వెల్లడించింది. ఎపి, యానాంలలో ఆగ్నేయ, దక్షిణ దిశగా వీస్తున్న గాలులతో వాతావరణం చల్లబడింది.

డిఆర్ఎం కప్ హంగామా ప్రారంభం



బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న డిఆర్ఎం అనూప్ సత్పతి

ఉత్సాహంగా బాక్సింగ్ టోర్నీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే స్పోర్ట్స్‌అసోసియేషన్, వాల్తేరు ఆధ్వర్యంలో తలపెట్టిన డిఆర్ఎం కప్ స్టేట్ యూత్ మెన్ అండ్ ఉమెన్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ విశాఖపట్నంలోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్, బాక్సింగ్ హాల్‌లో శుక్రవారం ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైంది. డివిజనల్ రైల్వే మేనేజర్ అనుప్ సత్పతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎడిఆర్ఎం (ఆపరేషన్స్) మనోజ్ కుమార్ సాహూ, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ (కో-ఆర్డినేషన్) ఎకె.మోహరానా, స్పోర్ట్స్ ఆఫీసర్ ప్రవీణ్ భాటితో పాటు పలువురు అధికారులు హాజరయ్యారు.

స్టీల్‌ప్లాంట్‌కు మూలధనం సిద్ధం

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ.పాల్



ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కాపాడేందుకు కావాల్సిన రూ.4 వేల కోట్లు తన వద్ద సిద్ధంగా ఉన్నాయని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కెఎ.పాల్ అన్నారు. శుక్రవారం సాయత్రం నగరంలోని తన ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన మూలధనం సమకూర్చానని, ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ఆ విషయాన్ని తెలియజేస్తూ.. అనుమతి కోరుతూ వచ్చానని తెలిపారు. జూన్ 4 వరకూ సమయం ఇచ్చానని పేర్కొన్నారు. ఆలోగా అనుమతి ఇవ్వకపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. కేంద్రం తన ప్రతిపాదనకు అనుకూలంగా స్పందిస్తే 72 గంటల్లో రూ.4 వేల కోట్ల వైట్ మనీని చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. ఒకవేళ మాట తప్పితే తన పాస్‌పోర్ట్ సీజ్ చేసుకోవచ్చునని తెలిపారు.

గెలిపిస్తే.. బెల్లం మార్కెట్‌కు పూర్వ వైభవం : చంద్రబాబు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి : టిడిపి ప్రభుత్వం రూ.35 కోట్లు ఖర్చు చేసి తుమ్మపాల చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తే వైసిపి ప్రభుత్వం మూసేసిందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. శుక్రవారం రాత్రి నెహ్రూ చౌక్ వద్ద జరిగిన 'ఇదేం ఖర్మ.. మన రాష్ట్రానికి' ముగింపు సభలో ఆయన మాట్లాడారు. టన్ను చెరుకుకు రూ.3,500 ఇస్తానని చెప్పి జగన్మోహన్ రెడ్డి ఇవ్వలేదన్నారు. తాము అధికారంలోకి వస్తే అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు పూర్వ వైభవం తెస్తామన్నారు. తాను అధికారంలో ఉంటే ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని పూర్తిచేసి వంశధార నది వరకు అనుసంధానం పూర్తయ్యేదని అన్నారు. అనకాపల్లిలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేస్తామన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్ విస్సన్నపేటలో భూమి సహా, కొండలు, గుట్టలు మింగేస్తున్నారని విమర్శించారు. జిల్లాలో కొత్తగా ఒక్క పరిశ్రమ తేలేకపోయారని అన్నారు. తాను సిఎంగా ఉన్నప్పుడు విశాఖపట్నాన్ని ఐటి హబ్, ఆర్థిక రాజధానిగా తయారుచేయడానికి ప్రణాళిక తయారుచేశానన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్రను అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానన్నారు. ఇంటింటికీ కుళాయి నీరు ఇప్పిస్తానన్నారు. కార్యక్రమంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత పట్టణంలో రోడ్‌షో నిర్వహించారు. వేలాది మంది టిడిపి కార్యకర్తలు హాజరయ్యారు.

డిపిఆర్‌లో మార్పులు చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రూ.152 కోట్లతో ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి పనులు చేపడుతున్న నేపథ్యంలో రూపొందించిన డిపిఆర్ మత్స్యకారులకు ఆమోదయోగ్యం కాదని, మత్స్యకార సంఘాలతో చర్చించి వారి అభీష్టం మేరకు డిపిఆర్‌లో మార్పులు చేసి పనులు చేపట్టాలని శుక్రవారం ఫిషింగ్ హార్బర్ గంగాలమ్మ గుడి వద్ద జరిగిన మత్స్యకారుల అఖిలపక్ష ఫిషింగ్ హార్బర్ యూనియన్ల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. చేపలు పాట (ఆక్షన్ హాల్)ను యథాస్థానంలో ఉంచి అభివృద్ధి చేయాలని, అదనంగా చేపలు పాటలు అవసరం లేదని సమావేశం తెలిపింది. ఫింగర్ జెట్టీలు నిర్మించాలని, ఫ్లోటింగ్ జెట్టీలు వద్దని, బోట్లు అండర్‌వాటర్ రిపేర్లకు తగిన స్థలం కేటాయించి వసతులు కల్పించాలని, బోట్లుకు ప్రమాదం జరిగి నీటిలో మునిగిపోయే సమయంలో వాటిని బయటకు తీయడానికి భారీ క్రేన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. బోట్లుకు ఐస్ లోడింగ్ చేయడానికి ఇతర రాష్ట్రాల హార్బర్లలో వినియోగిస్తున్నట్లు మిషన్లు ఏర్పాటు చేయాలని, వేటాడి తెచ్చిన మత్స్య సంపద, నెత్తలు, మొదలగు చేపలను ఎండబెట్టుకోవడానికి స్థలాన్ని కేటాయించాలని కోరింది. హార్బర్‌లో మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేసింది. ఒకటో నెంబరు జెట్టీలో ఉన్న ప్రైవేట్ వెసల్స్‌ను వెంటనే తొలగించాలని, టూరిజం బోట్లు తిరగడానికి అనుమతించకూడదని, వాటిని రుషికొండకు తరలించే ఏర్పాట్లు చేయాలని పేర్కొంది.

50 నగరాలలో ఎల్ అండ్ టి వ్యాపారం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈ త్రైమాసికంలో ఎల్ అండ్ టి ఫైనాన్స్, ఎస్ఎంఇ ఫైనాన్స్ వ్యాపారాన్ని 50కి పైగా నగరాలకు విస్తరించే యోచనలో ఉన్నట్లు ఎల్ అండ్ టి ఫైనాన్స్ హోల్డింగ్స్ లిమిటెడ్ సిఇఒ దీనానాథ్ దుబాసి తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. దేశంలోని నాన్ బ్యాంకింగ్ ఫైనాన్సియల్ కంపెనీలలో ఒకటైన ఎల్‌టిఎఫ్ ముంబై, పూణే నగరాలలో పైలెట్‌గా ప్రారంభించబడి గత ఆర్థిక సంవత్సరంలో స్థిరమైన వ్యాపారం సాధించిందన్నారు. స్వయం ఉపాధి పొందిన నిపుణులు, వ్యాపారుల వర్కింగ్ క్యాపిటల్ అవసరాలను తీర్చడానికి పనిచేస్తుందన్నారు. ప్రస్తుతం దేశంలోని 16 నగరాలలోని ఎస్ఎంఇ కస్టమర్ల అవసరాలను తమ కంపెనీ తీరుస్తుందని తెలిపారు.

పందిమెట్టలో తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పందిమెట్ట ప్రాంతంలో మంచినీటి సమస్యను తక్షణం పరిష్కరించాలని గురువారం సాయంత్రం ఐద్వా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వార్డు కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకురాలు కె.మణి మాట్లాడారు.

ముగిసిన కామెడీ వర్క్‌షాప్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బాల వికాస ఫౌండేషన్ ఆధ్వర్యంలో హాస్య ప్రియ కామెడీ క్లబ్ సహకారంతో మూడు రోజులుగా ఎంవిపి.కాలనీలోని ఎస్‌విపి డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహిస్తున్న కామెడీ వర్క్‌షాప్ శుక్రవారంతో ముగిసింది. శిక్షణలో పాల్గొన్న వారికి సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీశ్వరరావు ధ్రువపత్రాలు అందజేశారు.